సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 18 । అక్టోబర్ । 2025



క్షేత్రంలో కుక్కల స్వైర విహారం

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. గుంపులుగా తిరుగుతూ భక్తులను హడలెత్తిస్తున్నాయి. 10లో ▸



అలరించిన యువజనోత్సవాలు

తణుకు మహిళా కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు అలరించాయి. విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. 10లో ▸



మనసున్న మెకానిక్

మండవల్లి మండలం పులపర్రుకి చెందిన బైక్ మెకానిక్ నీలం నాగరాజు ప్రతి సోమవారం అన్నదాతగా మారాడు. 10లో ▸

న్యూస్‌రీల్

ఆటో కార్మికుల ధర్నా



భీమవరంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: ఉచిత బస్సు ప్రయాణం కారణంగా నష్టపోతున్న ఆటో కార్మికులకు రూ.30 వేలు ఆర్థిక సాయం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికుల ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 6.50 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉంటే కేవలం 2.90 లక్షల మందికి మాత్రమే ప్రభుత్వం సాయం అందించిందన్నారు. నెలకు ఆటో డ్రైవర్ రూ.20 వేలు సంపాదిస్తాడని ప్రభుత్వం ఏడాదికి రూ.15 వేల ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఓటు బ్యాంక్‌ను దృష్టిలో పెట్టుకుని పథకాలు ప్రవేశపెడితే చాలా మంది నష్టపోతారన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులందరికీ న్యాయం చేయాలని లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు బి.వాసుదేవరావు, పీవీ ప్రతాప్, ఎం.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి కార్తీక మాసోత్సవాలు



పంచారామ క్షేత్రంలో సమీక్షిస్తున్న ఆర్డీఓ

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడిలోని పంచారామ క్షేత్రం ఉమా సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం (సోమారామం)లో ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం దేవస్థానంలో ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మొబైల్ టాయిలెట్స్, మంచినీరు, మెడికల్ క్యాంపులు తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. దేవస్థానం వద్ద పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా దేవదాయశాఖ అధికారి సూర్యప్రకాష్, ఈఓ డి.రామకృష్ణంరాజు, దేవస్థానం చైర్మన్ బంగారురాజు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో చెత్త తొలగింపు



సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: ద్వారకా తిరుమల శ్రీవారి నృసింహ సాగరం (పుష్కరిణి) ఒడ్డున పేరకుపోయిన చెత్తను దేవస్థానం సిబ్బంది తొలగించారు. అలాగే మెట్లను శుభ్రం చేశారు. ఈనెల 13న 'సాక్షి'లో 'మందుబాబులకు అడ్డాగా.. శ్రీవారి పుష్కరిణి' శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పుష్కరిణిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి మెట్లపై ఉన్న బీరు సీసాలు, కాల్చిపడేసిన సిగరెట్లను తొలగించారు. ఒడ్డున పేరుకుపోయిన చెత్తను తొలగించి, శుభ్రం చేశారు. అయితే నీరు మురుగుతో దుర్వాసన వెదజల్లుతుండటంతో కార్తీక మాసంలో భక్తులు అందులో స్నానాలు ఆచరించే వీలు లేకుండా ఉంది. కనీసం పుష్కరిణి ప్రాంతంలో లైట్లు ఏర్పాటు చేస్తే మెట్లపై, కార్తీక దీపాలు వెలిగించేందుకు, పుష్కరిణిలో దీపాలు వదిలేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

బాలికా దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలికలు అన్ని రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. స్థానిక గవరవరం సెంట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్య అనే ఆయుధంతో ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

కలానికి సంకెళ్లపై కన్నెర్ర

కక్ష సాధింపుపై గర్జన

- కూటమి ప్రభుత్వ తీరును ఖండించిన ప్రజా, జర్నలిస్ట్ సంఘాలు
- 'సాక్షి'పై దాడులను ఆపాలని డిమాండ్
- జిల్లావ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత

సాక్షి, భీమవరం: నకిలీ మద్యంపై వార్తలు రాసినందుకు 'సాక్షి'పై కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలను ప్రజా, జర్నలిస్ట్ సంఘాలు ఖండించాయి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు వినతులు అందజేశారు. భీమవరంలో ఏపీయూడబ్ల్యూజే, వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, దళిత ఐక్యవేదిక సంఘాల నాయకులు శాంతియుతంగా నిరసన తెలిపారు. మీడియాపై దాడులు ఆపాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, విలేకర్లపై నిర్బంధాలను అరికట్టాలని నినాదాలు చేశారు. డీఎస్పీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యర్రంశెట్టి గిరిజాపతి, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు గాదిరాజు రామరాజు, చిగురుపాటి సందీప్, గుంటి ప్రభు, గంటా సుందరకుమార్, బి.వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు, మల్లుల శ్రీనివాసరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, డి.నాగు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బంధన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో శాంతియుత ప్రదర్శనలో జర్నలిస్ట్, ప్రజాసంఘాల నాయకులు

- తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, న్యాయవాదులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నారాయణకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు.
- పాలకొల్లులో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ ఎన్.దుర్గకు వినతిపత్రం సమర్పించారు.



పాలకొల్లులో డీటీ దుర్గకు వినతిపత్రం ఇస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు



ఆకివీడులో ఆర్ఐకు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

- తాడేపల్లిగూడెంలో ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.
- ఉండి నియోజకవర్గం ఆకివీడులో తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు ధర్నా చేశారు. అనంతరం ఆర్ఐ వి.ఆంజనేయులకు వినతిపత్రం అందజేశారు.



తణుకులో తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న పలు సంఘాల నేతలు

రాజ్యాంగ విరుద్ధంగా..



ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు వస్తున్నాయని పోలీసులను పత్రికా కార్యాలయాలకు పంపి ఎడిటర్, జర్నలిస్టులను వేధింపులకు గురి చేయడం రాజ్యాంగ విరుద్ధం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే రీతిలో ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటు. సాక్షిపై కక్ష సాధింపు చర్యలను ఆపాలి.

– కామన మునిస్వామి, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి కళంకం



సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి కళంకం తెస్తోంది. కల్తీ మద్యం విక్రయాలు, దాని వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే వివరాలను ప్రజల ముందుకు తీసుకురావడంతోనే సాక్షిపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోవాలి.

– చెల్లబోయిన రంగారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి, భీమవరం

అందరూ ఖండించాలి



నిజాన్ని నిర్భయంగా బయటపెడుతున్న సాక్షిపై ప్రభుత్వం జులుం ప్రదర్శించడం మంచిది కాదు. సాక్షిపై కూటమి ప్రభుత్వం అకారణంగా కేసులు పెడుతూ వేధిస్తున్న వైనాన్ని అందరూ ఖండించాలి. ప్రభుత్వ తీరుతో ప్రజాస్వామ్యంలో పత్రికలకు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

– గుంటి ప్రభు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ సెక్రటరీ

పత్రికా స్వేచ్ఛను హరిస్తూ..



రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సాక్షి మీడియాలో వచ్చిన వరుస కథనాలకు బెంబేలెత్తిన కూటమి ప్రభుత్వం సాక్షిని అణచివేయాలని పోలీసులను ఉసిగొల్పడం దారుణం. పత్రికా స్వేచ్ఛను హరించేలా ఇలాంటి చర్యలు దుర్మార్గం.

– గంటా సుందర్‌కుమార్, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వానికి భజన చేయాలా?



కూటమి ప్రభుత్వం మీడియాను కట్టుబానిసలుగా చూస్తోంది. తమకు అనుకూలంగానే రాయాలనే ధోరణితో అనుకూల మీడియాను అందలమెక్కించి ప్రజల పక్షాన నిలిచే మీడియాను అణగదొక్కాలని కుట్రలు చేస్తోంది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా, మీడియా వ్యతిరేక విధానాలకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం.

– గాదిరాజు రామరాజు, వైఎస్సార్‌సీపీ భీమవరం పట్టణ అధ్యక్షుడు

సాక్షిపై కూటమి కక్ష



ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతున్న సాక్షి మీడియాపై కూటమి కక్ష సాధింపు చర్యలు చేపట్టింది. నకిలీ మద్యం, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళుతున్నారన్న అక్కసుతో సాక్షిని కట్టడి చేయాలని చూస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పోకడలు సరికాదు.

–బంధన పూర్ణచంద్రరావు, సీనియర్ జర్నలిస్ట్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్

మీడియాతో చెలగాటం



కూటమి ప్రభుత్వం మీడియాతో చెలగాటమాడుతోంది. తాము చెప్పిందే రాయాలి, ప్రచారం చేయాలనే ధోరణి మంచిది కాదు. అక్రమాలు, అవకతవకలు జరిగినప్పుడు బయటపెట్టడం మీడియా బాధ్యత. తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్న సాక్షిపై ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరించడం మంచిది కాదు.

– చిగురుపాటి సందీప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కన్వీనర్

మీడియాపై వేధింపులు తగదు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే అక్కసుతో కూటమి ప్రభుత్వం సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలు సరికాదు. కల్తీ మద్యంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కూటమి నాయకులను దుమ్మెత్తిపోస్తుంటే.. కల్తీ మద్యంలో జరిగిన అక్రమాలను బయటపెడుతున్న సాక్షిపై దాడులు, నిర్బంధాలు దారుణం.

– బి.వాసుదేవరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు, అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు వంటిది. సమాజంలో అక్రమాలు, అన్యాయాలను వెలికితీసే గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్న మీడియాను అడ్డుకోవాలని చూడటం దారుణం. సాక్షి పత్రికపై దాడులు, నిర్బంధాలను ప్రజలు సహించరు.

– యర్రంశెట్టి గిరిజాపతి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గసభ్యుడు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులో చింతలపూడి సమీపంలో పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు (ఫైల్)

- చింతలపూడి కేంద్రంగా తెలంగాణకు..
- నిబంధనలు మీరి తరలింపు

చింతలపూడి: చింతలపూడి కేంద్రంగా ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండల సరిహద్దు గ్రామాలను కేంద్రంగా చేసుకుని రాత్రి వేళల్లో తెలంగాణలోని పలు ప్రాంతాలకు లారీలు, టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారు. చెక్ పోస్టులను తప్పించుకుని ప్రత్యామ్నాయ మార్గాల్లో రవాణా సాగుతున్నట్టు సమాచారం. దీంతో ఇసుక అక్రమ రవాణాకు ఈ ప్రాంతం అడ్డాగా మారింది. కొవ్వూరు, తాళ్లపూడి నుంచి ఇసుక అక్రమంగా పక్క రాష్ట్రానికి తరలిపోతోంది. ఈ నేపథ్యంలో కొవ్వూరు, తాళ్లపూడి ఇసుక రీచ్‌లలో చింతలపూడికి సంబంధించిన లారీలకు ఇసుక లోడింగ్‌కు నిరాకరించడంతో ఇక్కడి లారీ యజమానులు గత వారం లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం ఇక్కడి లారీలకు కూడా ఇసుక లోడింగ్ చేస్తున్నారు. అయితే ఎక్కువ శాతం ఇసుక తెలంగాణ నుంచి వచ్చిన లారీల్లో పక్క రాష్ట్రానికి తరలిపోతున్నట్టు స్థానిక లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ చెక్ పోస్టుల ద్వారా నిఘా పెట్టినా ఇసుక రవాణా మాత్రం ఆగడం లేదని తెలుస్తోంది. గత నెల 4న పోలీసులు తెలంగాణకు తరలిపోతున్న సుమారు 16 లారీలను చింతలపూడిలో పట్టుకుని సీజ్ చేశారు. అప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టిన రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఈనెల 9న రాత్రి ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని చింతలపూడి మండలంలో తనిఖీలు నిర్వహించి మరో 5 లారీలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదుచేశారు. సరిహద్దు గ్రామాల పేరు మీద బిల్లు తీసుకుని తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. ఇసుకను స్థానిక లారీలకు మాత్రమే సరఫరా చేయాలని లారీ యజమానుల సంఘం డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ రవాణాను అరికట్టాలి



స్థానికంగా లభ్యమయ్యే గోదావరి ఇసుకను స్థానిక లారీలకు లోడింగ్ చేయడం వల్ల జిల్లాలో ఇసుక కొరత ఉండదు. అధికారులు ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

– తుల్లాబత్తుల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు

ఆదాయ మార్గాలు విస్తరించాలి

ఏలూరు(మెట్రో): పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో ఆదాయాలను పెంచేలా కృషి చేయాలని డీపీఓ కొడాలి అనురాధ కోరారు. స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో మూడు రోజుల నుంచి పంచాయతీ సొంత ఆదాయ వనరులు అభివృద్ధిపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. డీపీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ సొంత ఆదాయ మార్గాలను విస్తరించుకుని అభివృద్ధి చెందాలన్నారు. రూల్ పొజిషన్ తప్పక పాటించాలన్నారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగి రాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల రికార్డుల నిర్వహణపై అత్యంత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సీనియర్ రిసోర్స్ పర్సన్, ఉంగుటూరు ఎంపీడీఓ జీఆర్ మనోజ్ మాట్లాడారు. శిక్షణకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాల నుంచి 48 మంది పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం టీఓటీ (శిక్షకులకు)లకు సర్టిఫికెట్లు అందించారు. ఎంఓటీలుగా గణపవరం, నిడమర్రు మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు పీవీ సత్యనారాయణ, ఎస్.తిరుపతిస్వామి, చేబ్రోలు, సూరప్పగూడెం సెక్రటరీలు జీడీ శ్రీనివాసరావు, ముత్తయ్య ఫ్యాకల్టీలుగా వ్యవహరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేద వర్గాలకు వైద్య విద్య, నాణ్యమైన వైద్యం ఉచితంగా అందాలంటే కూటమి ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రజలు నడుంకట్టాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా తణుకు 15వ వార్డు వీరభద్రపురంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టి ఐదు కాలేజీలను పూర్తిచేశారన్నారు. అయితే చంద్రబాబు సర్కారు మెడికల్ కాలేజీలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే క్రమంలో ప్రైవేటీకరణకు కంకణం కట్టుకుందని విమర్శించారు. వైద్యకళాశాలలు ఎక్కడా లేవని, జీవో కూడా విడుదల కాలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు చెంపదెబ్బ మాదిరిగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి వెళ్లి స్వయంగా వైద్య కళాశాల చూపిస్తే స్పీకర్ తోకముడిచారని గుర్తుచేశారు. తణుకుకు సమీపంలోని పాలకొల్లులో వైద్య కళాశాల పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తే ఎటువంటి ఆపరేషన్లు అయినా ఉచితంగా చేసే వీలుంటుందన్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచితే ప్రస్తుత కూటమి సర్కారు అటకెక్కించిందని విమర్శించారు.



తణుకు 15వ వార్డులో కోటి సంతకాల సేకరణలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

జీఎస్టీ ఫ్లెక్సీలు విడ్డూరం

తణుకు ఎమ్మెల్యే జీఎస్టీ కారణంగా కుటుంబానికి రూ.15 వేలు పొదుపంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి కారుమూరి అన్నారు.

పేదలు రూ.2 లక్షలు ఖర్చుపెడితేనే రూ.15 వేలు పొదుపు వస్తుందని.. అయితే అంత మొత్తంలో ఖర్చుచేసే స్థితి పేదలకు ఉందా అని నిలదీశారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజల ఖాతాలకు డబ్బులు జమచేసేవారని, దీంతో దీపావళి వంటి పండగల రోజుల్లో తణుకు ప్రాంతం కళకళలాడుతుండేదన్నారు. అయితే ప్రస్తుతం ప్రజలు, వ్యాపారులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకునే పరిస్థితి ఎదురైందన్నారు. పేరు ప్రఖ్యాతలు ఉన్న తణుకులో నేడు కల్తీ మద్యం, పేకాట, గంజాయి విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దంటూ స్థానికులు పత్రాలపై సంతకాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ధనలక్ష్మి, 15వ వార్డ్ నాయకులు గనసాల సింగ్, మల్లిపూడి వెంకట్రావు, ఆచంట లక్ష్మణరావు, కాసగాని రామన్న, నూతంగా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


రైళ్లలో మహిళలకు భద్రత కల్పించాలి

ఏలూరు (టూటౌన్): రైళ్లలో మహిళకు భద్రత కల్పించాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏలూరు జిల్లా ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామల రాణి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే రైలులో మహిళపై అగంతకుడు కత్తితో బెదిరించి అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటీవల రైళ్లలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగి ఉన్న రైళ్లను అడ్డాగా చేసుకుని, పని ప్రదేశాల్లో మహిళలపై దాడులు పెరుగుతున్నా రైల్వే అధికారులకు పట్టడం లేదన్నారు. రైళ్లలో పోలీసుల నిఘాపెంచాలని, ప్రతి బోగీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాలు, సహకార, రవాణా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. త్వరలో ధాన్యం సేకరణ ప్రారంభం కానున్న దృష్ట్యా సత్వర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అందుబాటులో ఉన్న గోనె సంచులు, వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలపై చేపట్టిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ సమయంలో రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయనున్నామన్నారు. అలాగే రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఎస్ఓ ఎస్.సరోజ, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎండీ ఇబ్రహీం, జిల్లా సహకార శాఖ అధికారి సంకు మురళీకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి ఎంవీ కృష్ణారావు, ఏఎస్ఓ ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

ఇంటర్ కాలేజీ ఫెన్సింగ్ పోటీలు



భీమవరంలో ఫెన్సింగ్ పోటీల దృశ్యం

భీమవరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఎట్ ఫెన్సింగ్ టోర్నమెంట్ శుక్రవారం భీమవరంలోని సీఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు 50 మంది పాల్గొనగా వారికి పలు విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు సీఎస్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, స్టేట్ ఫెన్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ జీఎస్‌వీ కృష్ణమోహన్ తదితరులు బహుమతులు అందజేశారు.

నూకాలమ్మ ఆలయానికి రూ.5 లక్షల విరాళం



నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో దాతను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. నిత్య కైంకర్యాలు, పంచామృతాభిషేకాలు, ఏకాదశ హారతి పూజలు నిర్వహించినట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ రొంగల నాగేశ్వరరావు, కుటుంబసభ్యులు రూ.5,01,116 అందజేసినట్లు చైర్మన్ తెలిపారు. రొంగల నాగేశ్వరరావు రమాదేవి దంపతులు, దేవీ ప్రసాద్, అనూష దంపతులు, భాస్కర్ కుమార్, సాయి చంద్రిక దంపతులు, వారి కుటుంబ సభ్యులను సత్కరించారు.

డీఎల్‌పీఓపై ఫిర్యాదు

నరసాపురం రూరల్: పంచాయతీలో ఇతర సర్పంచుల కాలంలో చెల్లించిన బిల్లులు తాము చెల్లించినట్లుగా చూపించి తమ పరువును దిగజార్చేలా ప్రకటనలు ఇచ్చిన డీఎల్‌పీఓ కిరణ్మయిపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు మల్లవరం సర్పంచ్ సంధి సుజాత తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. 2021, ఏప్రిల్ 12, మే 7 తేదీలతో పంచాయతీ సొమ్మును డ్రా చేశారని ఆ సమయానికి సర్పంచిగా ఎన్నికైనప్పటికీ చెక్ పవర్ రాలేదని వాటిని దుర్వినియోగం చేసినట్లు డీఎల్పీఓ షోకాజ్ నోటీసులో పేర్కొన్నారన్నారు. కొంతమంది ఒత్తిడితో నోటీసులు ఇప్పించారని భావిస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: బైక్‌పై వెళ్తున్న వారిని కారు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. రూరల్ హెచ్‌సీ జిలానీ వివరాల ప్రకారం.. ఉండి మండలం చిలుకూరుకు చెందిన నల్లం సత్యనారాయణ, అతని భార్య, మనువడు గుబ్బల మంగమ్మ గుడికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తున్నారు. వెంకట్రామన్నగూడెం వచ్చేసరికి వారి బైక్‌ను కారు ఢీకొంది. సత్యనారాయణ, అతని భార్య, మనుమడికి గాయాలయ్యాయి. వారిని 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించారు. రూరల్ హెచ్‌సీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షేత్రంలో కుక్కల స్వైరవిహారం

- క్షేత్రంలో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు
- కాలినడక భక్తులపై తరచు దాడులు
- చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకుంటున్న భక్తులు





శ్రీవారి పుష్కరణి ముందు రోడ్డుపై గుంపుగా ఉన్న వీధి కుక్కలు, శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద పడుకున్న వీధి కుక్కలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వస్తున్న భక్తులపై సైతం అవి దాడులకు తెగబడుతున్నాయి. దాంతో వారు బిక్కుబిక్కుమంటూ ఆలయానికి చేరుకుంటున్నారు. శ్రీవారి క్షేత్రానికి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వస్తున్నారు. శుక్ర, శనివారాల్లో ఈ సంఖ్య వేలల్లో ఉంటోంది. రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, భీమవరం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దూబచర్ల–రాళ్లకుంట మీదుగా క్షేత్రానికి చేరుకుంటున్నారు. అలాగే ఉయ్యూరు, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భీమడోలు మీదుగా, అదేవిధంగా దగ్గర దారైన తడికలపూడి–వెంకటకృష్ణాపురం మీదుగా వస్తున్నారు. ఈ దగ్గర దారిలో వచ్చే భక్తులు శ్రీవారి పుష్కరణి(నృసింహ సాగరం) వెనుక వైపు నుంచి, గట్టు వెంట చెరువు వీధికి చేరుకుంటున్నారు. అక్కడున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద, దసరా మండప ప్రాంతంలోని ఇళ్ల వద్ద ఆ భక్తులు కాసేపు సేదతీరి, శ్రీవారి ఆలయానికి చేరుకుంటున్నారు.

హడలెత్తిస్తున్న శునకాలు..

పుష్కరిణి ముందు, పుష్కరిణిలోని ర్యాంపుపై వీధి కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. చేతి కర్ర లేని కాలినడక భక్తులపై అవి దాడులకు పాల్పడుతున్నాయి. ఎక్కువగా బాలలు, చిన్నారులపై దాడి చేస్తున్నాయి. ఇటీవల లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కాలినడక భక్తుడు సాయిల రవి కుమారుడు యశ్వంత్‌పై దాడి చేశాయి. కొందరు పరుగులు తీస్తూ వాటి నుంచి తప్పించుకుంటున్నారు. ఈ వీధి కుక్కల బెడద కొండపైన భక్తులకూ తప్పడం లేదు. దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద భక్తులు సంచరించే ప్రాంతాల్లో సంచరిస్తూ, అక్కడే పడుకుంటున్నాయి. అవి ఎక్కడ దాడి చేస్తాయోనని భక్తులు భయపడుతున్నారు.



పుష్కరణిలోని ర్యాంపుపై పడుకున్న శునకాలు

వైరస్ శునకాలతో ఆందోళన

వీధి కుక్కల్లో ఎక్కువగా వైరస్ సోకినవే ఉంటున్నాయి. శరీరంపై పుండ్లు పడి.. భక్తుల మధ్యలో సంచరిస్తూ, అందరికీ ఇబ్బంది కలిగిస్తున్నాయి. వైరస్‌తో ఉన్న ఈ కక్కలు కరిస్తే పరిస్థితి ఏంటూ.. అని భక్తులు ఆందోళన చెందుతున్నారు. దేవస్థానం అధికారులు అప్పుడప్పుడు కొండపైన, ఆలయ పరిసరాల్లో తిరిగే శునకాలను పట్టిస్తున్నారు. వాటిని పట్టుకుని తీసుకెళ్తున్న వారు అటవీ ప్రాంతంలో విడిచి పెట్టకుండా, గ్రామ శివారుల్లో వదిలేస్తున్నారు.



ఇటీవల వీధి కుక్క దాడిలో గాయపడి పీహెచ్‌సీకి చేరిన బాలుడు

అమాంతం దాడి చేశాయి

కుటుంబ సమేతంగా కాలినడకన శ్రీవారి క్షేత్రానికి వచ్చాను. పుష్కరిణి గట్టుపై నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్దకు చేరుకోగా, అక్కడున్న వీధి కుక్క మా బాబు యశ్వంత్‌పై దాడి చేసింది. కాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సాయంతో పీహెచ్‌సీకి వెళ్లాం. అధికారులు వీధి కుక్కల నుంచి భక్తులకు రక్షణ కల్పించాలి.

– సాయిల రవి, కాలినడక భక్తుడు, లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామం

ఆరు నెలల క్రితమే పట్టించాం

ఆలయ పరిసరాల్లో తిరిగే వీధి కుక్కలను ఆరు నెలల క్రితమే పట్టించి, అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేలా చర్యలు తీసుకున్నాం. మళ్లీ కాలినడక భక్తుల వెంట అవి క్షేత్రానికి చేరుకుంటున్నాయి. వాటిని పట్టిస్తుంటే జంతు ప్రేమికులు ఊరుకోవడం లేదు. పెరిగిన కుక్కలబెడదపై ఆలయ అధికారులతో చర్చించి, తగు చర్యలు తీసుకుంటాం.

– టి.సూర్యనారాయణ, శ్రీవారి దేవస్థానం డీఈ

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మానుకొండ విలియమ్స్(ఫైల్)

ద్వారకాతిరుమల: పొలంలోని మోటారు వద్ద ఫ్యూజ్ తీస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోడిగూడెంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దొరసానిపాడుకు చెందిన మానుకొండ విలియమ్స్(20) దెందులూరు ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలకు సెలవు పెట్టి, కోడిగూడెంలో ఆయిల్‌పామ్ తోటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. పని పూర్తయిన తరువాత మోటారును ఆఫ్ చేసే ప్రయత్నంలో స్విచ్ లేకపోవడంతో, ఫ్యూజ్‌ను తీస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని విలియమ్స్‌ను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో ఏడేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్) : అత్యాచార యత్నం కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఏలూరు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీ కృష్ణ శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన కేసులో దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన మాంద్రు వెంకట ఆనంద్‌కు శిక్షను ఖరారు చేశారు. కొయ్యలగూడెం పీఎస్‌లో అప్పట్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసారు.

సంతగుంట చెరువు ఆక్రమణ



సంత చెరువు గర్భాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన కబేళా దుకాణాలు



సంత చెరువును ఆక్రమించి నూతనంగా నిర్మిస్తున్న సర్వీసింగ్ సెంటర్

కొయ్యలగూడెం: యర్రంపేట సంత చెరువు ఆక్రమణలకు గురైంది. మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న సంతచెరువు గట్టుపై కబేళా దుకాణాల సముదాయాలు వరుసగా నిర్మించారు. మరికొంతమంది వాణిజ్య దుకాణాలను నిర్మిస్తున్నారన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 30 ఎకరాల గర్భం కలిగిన సంత చెరువు ఆక్రమణలకు గురికాగా ఇరవై ఎకరాల గర్భం మిగిలిందని, దీంతో 150 ఎకరాలకు సాగునీరు అందే చెరువు నీరు పట్టుమని 25 ఎకరాలకు కూడా సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. కబేళా వ్యర్థాలు చెరువులో కలపడంతో నీరు కలుషితం అవుతోందంటున్నారు. దుర్గంధంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఎదురవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలోనే వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేయగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిని అధికారులు తొలగించారన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలోకి వచ్చాక ఆక్రమణలు యథాతథంగా కొనసాగుతున్నాయని అన్నారు.

నిబంధనలను లెక్కచేయక



వాహనాలకి నెంబర్ ప్లేట్లు తప్పనిసరి.. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ నెంబరు ప్లేట్‌తో యజమాని చిరునామా సేకరించడానికి వీలుంటుంది. రవాణా శాఖ ఫోన్‌గ్రామ్‌తో కూడిన నెంబర్ ప్లేట్లు వాహనదారుడికి కేటాయిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాల్సిన సంబంధిత అధికారులు మనకెందుకులే అన్నట్లుగా ఉన్నారు. దీంతో వాహనదారులు వారికి ఇష్టమైన నాయకుల పేర్లు, అభిమాన నేతల ఫొటోలతో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కొన్ని వాహనాలకు నెంబర్ ప్లేట్లు కూడా ఉండడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

100 ఏళ్ల రావిచెట్టు నరికివేత

టి.నరసాపురం: ఒక వ్యక్తి స్వార్థం కోసం వందేళ్ల పైబడిన రావిచెట్టు నేలకొరిగింది. మండలంలో మక్కినవారిగూడెం పంచాయతీ కొల్లివారిగూడెం రెవెన్యూ గ్రామంలో రావిచెట్టును ఓ రైతు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా నరికి కలపను ట్రాక్టర్‌పై తరలించాడు. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. కొల్లి వారిగూడెం పరిధిలో ముత్యాలమ్మ గుడి బండి దారి భూమి సుమారు 70 సెంట్లు ఉంది. ఈ భూమిని కొంతకాలంగా ఒక వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడు. అతను మరో వ్యక్తికి ఆ భూమిని కౌలుకు ఇచ్చినట్లు సమాచారం. కౌలుకు తీసుకున్న వ్యక్తి ఆ భూమిలో ఉన్న 100 ఏళ్ల రావిచెట్టును నరికి ట్రాక్టర్‌పై తరలించాడు. ఈ సంఘటనపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్య తీసుకోవాలని, కలపను స్వాధీనం చేసుకుని ఆక్షన్ నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



కొల్లివారిగూడెంలో రావిచెట్టును నరికివేసిన దృశ్యం

అలరించిన యువజనోత్సవాలు





తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో యువజనోత్సవాల్లో డమరుకంతో నృత్యం చేస్తున్న విద్యార్థినులు, జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు అలరించాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు నిర్వహించిన క్లాసిక్, ఫోక్, జానపద నృత్యాలతోపాటు వ్యవసాయ రంగ అంశాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో ఈ యువజనోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హాజరయ్యారు. సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్.ప్రభాకర్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపల్ యుఎల్ సుందరీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

వారసత్వ సంప్రదాయాలపై అవగాహన పెంచుకొని వాటిని కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు . ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవాల్లో పాల్గొన్న ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



యువజనోత్సవాల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

చెరువులో మునిగి రిటైర్డ్ ఉద్యోగి మృతి



మృతుడు బసవ ప్రభాకరరావు (ఫైల్)

భీమడోలు: భీమడోలు శివాలయం వద్ద చెరువులో ప్రమాదవశాత్తు జారి పడి రైల్వే రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ మృతి చెందాడు. భీమడోలు గ్రామానికి చెందిన బసవ ప్రభాకరరావు(74) రెండు రోజులుగా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. ఈ నెల 15న సంతమార్కెట్‌కు సైకిల్‌పై వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. అతని సైకిలు చెరువులో సమీపంలో దొరికింది. చెరువులో ప్రభాకరరావు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చలపతిరావు తెలిపారు.

బైక్ చోరీ కేసులో జైలు

ఆగిరిపల్లి: నేరం రుజువు కావడంతో ముద్దాయికి సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ నూజివీడు కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. కృష్ణా జిల్లా పామర్రు మండలం మల్లవరానికి చెందిన చుండూరు రమేష్ సగ్గూరులో బైక్ చోరీ చేశాడు. దీనిపై ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముద్దాయిని రాజమండ్రి వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగిరిపల్లి ఎస్సై శుభ శేఖర్ దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాలు కోర్టుకు సమర్పించారు. నేరం రుజువు కావడంతో రమేష్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శ్రావణి తీర్పు వెల్లడించారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పీడీఎస్‌ఓ, ఎన్‌వైఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఫైర్ స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్య, ఉపాధి రంగాల సంక్షోభం, యువత ఆత్మహత్యలు అంశంపై జిల్లా సదస్సును స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సదస్సులో కవి, రచయిత సుంకర గోపాల్ మాట్లాడారు. విద్యా విధానం అశాస్త్రీయంగా ఉందని, మార్కులు, ర్యాంకులు, సర్టిఫికెట్లే లక్ష్యంగా సాగుతున్న చదువులు విద్యార్థుల ఆత్మహత్యలకు దోహదం చేస్తున్నాయని అన్నారు.

మనసున్న మెకానిక్

నాలుగేళ్లుగా ప్రతి సోమవారం పేదలకు అన్నదానం

కైకలూరు: అతనిదో మధ్య తరగతి కుటుంబం.. బండి రిపేరు చేస్తే కాని బతుకు బండి ముందుకు సాగదు. తొమ్మిదేళ్ల క్రితం తండ్రి మరణించాడు. సోదరుడు కూడా మరణించాడు. తల్లి బట్టలు అమ్ముతూ చేదోడుగా మారింది. భార్య, ముగ్గురు సంతానం. కానీ ఎదో వెలితి. పట్టెడన్నం కోసం పరితపిస్తున్న బడుగులకు అన్నదానం చేయాలని సంకల్పించాడు. పేదరికంలో మగ్గుతున్న అభాగ్యులకు ప్రతీ సోమవారం అన్నదాతగా మారాడు. మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన నీలం నాగరాజు బైక్ మెకానిక్. పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. సాదాసీదా జీవనం. శివుడు అంటే ఇష్టం. శివుడికి ఇష్టమైన సోమవారం పేదలకు అన్నదానం చేయాలని భావించాడు. కైకలూరులో యానాదుల కాలనీ, బస్టాండ్, రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్లలో యాచకులు, అనాథలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తాడు.నాగరాజు నాలుగేళ్లగా ప్రతీ సోమవారం పేదల ఆకలి తీరుస్తున్నాడు. కరోనా సమయంలోనూ సేవలు ఆపలేదు. ఇంటి వద్ద కుటుంబ సభ్యులు వంటలు తయారు చేస్తారు. అప్పుడప్పుడు దాతల సాయంతో మరింత మందికి భోజనాన్ని అందిస్తున్నాడు. ఒక వేళ సోమవారం ఇతర ప్రాంతాల్లో ఉంటే అక్కడ కూడా హోటల్‌లో భోజనాలు కట్టించి పేదలకు పంపిణీ చేయిస్తాడు. కుటుంబ సభ్యుల ఆదరణ కోల్పోయి వృద్ధాప్యంలో అనేక మంది చాలీచాలని కడుపుతో జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారి కోసం వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు నాగరాజు తెలిపారు.



కైకలూరులో భోజన ప్యాకెట్లు అందిస్తున్న మెకానిక్ నాగరాజు



బండికి రిపేరు చేస్తోన్నా మెకానిక్ నాగరాజు

కార్తీకానికి క్షేత్రపాలకుడి ఆలయం ముస్తాబు



ఆలయం ముందు నూతనంగా నిర్మించిన రాజగోపురం

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రపాలకుడి ఆయలంగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 21 నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుంది. ఆలయంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. రూ.4.50 కోట్లతో ఆలయం ముందు చేపట్టిన రాజగోపుర నిర్మాణ పనులు పూర్తి కాగా, ప్రస్తుతం రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. కార్తీకమాసం ప్రారంభం నుంచి భక్తులు పూర్తిస్థాయిలో ఈ రాజగోపురంలోంచి రాకపోకలు సాగించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 21న సాయంత్రం 6 గంటలకు ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. వచ్చేనెల 5న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం ఆలయ ఆవరణలో జ్వాలా తోరణాన్ని, అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణ పరమాత్మకు, చింతామణి దేవికి విశేష పూజలు



విశేష అలంకరణలో కృష్ణ పరమాత్మ, చింతామణి దేవి

తాడేపల్లిగూడెం (టీటౌన్): బహుళ ఏకాదశి పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో కృష్ణ పరమాత్మకు, చింతామణిదేవి అమ్మవార్లకు శుక్రవారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు, విశేష పూజలు మందిర అర్చకులచే నిర్వహించారు. స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాడేపల్లిగూడెం (టీటౌన్): యుక్త వయస్సు బాలికలను గుర్తించి, బాల్య వివాహాలు జరగకుండా చూడాలని పలువురు వక్తలు అవగాహన కల్పించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం వార్డు స్థాయి సీఎంపీఓఎస్ (బాల్య వివాహ నిరోధక అధికారులు)కు శిక్షణ కార్యక్రమం జరిగింది. వార్డు అడ్మిన్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శులు హాజరైయారు. మునిసిపల్ కమీషనర్ యేసుబాబు మాట్లాడుతూ బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలు చెప్పాలన్నారు. సీడీపీఓ టీఎల్ సరస్వతి మాట్లాడుతూ బాల్యవివాహ నిరోధక చట్టం, ఫోక్సో యాక్ట్, చైల్డ్ రైట్స్ తదితర విషయాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సీహెచ్‌కే దుర్గాభవాని, కె.విశాలాక్షి, ఎం.సుజాత, వార్డు సెక్రటరీలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్టేషన్ ఆవరణలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వృద్ధులు రైళ్లు ఎక్కి, దిగే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. లిఫ్ట్ సౌకర్యం లేక ప్లాట్‌ఫామ్ మారే క్రమంలో మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ, కామన మునిస్వామి, పోలనాటి ఉష, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పది, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలకు ఆహ్వానం

తణుకు అర్బన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విధానం ద్వారా నిర్వహించే ఇంటర్మీడియట్, 10వ తరగతి కోర్సుల ప్రవేశాలకు సంబంధించి తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి అనంతరం ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి చదవగలిగిన, రాయగలిగిన పరిజ్ఞానం కలవారంతా పదో తరగతికి అర్హులని, 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పూరైన వారంతా ఇంటర్మీడియేట్ కోర్సు చదువుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్, టాక్సీ స్టాండ్, వివిధ కూడళ్లలో ప్రజానీకానికి పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు.

రీ-సర్వేకు రైతులు సహకరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న రీ-సర్వేను శుక్రవారం జిల్లా ఎంఎల్ఎస్‌వో కే.జాషువా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రీ-సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే జరుగుతున్న సమయంలో రైతులందరూ తమ భూమి హక్కు పత్రాలతో సర్వే టీమ్‌కు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కాశీకృష్ణ, తాడేపల్లిగూడెం డివిజన్ ఇన్‌చార్జ్ డీఐవోఎస్ రౌతు రామకృష్ణ, మండల సర్వేయర్ ఎస్.చక్రవర్తి ఉన్నారు.

విద్యార్థులకు స్టీల్ పేట్ల అందజేత

పెంటపాడు: మండలంలోని గూడెం కడకట్ల కోడే వెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. స్కూల్ పూర్వ విద్యార్థి, ఐఆర్ఎస్ ఇన్‌కంట్యాక్స్ కమీషనర్ ముంబాయికి చెందిన బండి రామకృష్ణ ఈ సాయం చేసినట్లు స్కూలు హెచ్‌ఎం ఈవీ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా దాతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 200 పేట్లను మధ్యాహ్న భోజనం చేసే స్కూల్ విద్యార్థులకు అందజేశారు.

గూడెంలో పారిశుద్ధ్య లోపం

- ఖాళీ స్థలాలు..వ్యాధులకు నిలయాలు
- ఫలితమివ్వని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర
- తహసీల్దార్ కార్యాలయంలో అపరిశుభ్ర పరిస్థితులు
- పట్టించుకోని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఖాళీ స్థలాలు

తాడేపల్లిగూడెం (టీటౌన్): పారిశుద్ధ్య నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్న క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న పట్టణంలో పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం మార్పు రావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఫోటోలకు పోజులిచ్చి వెళ్లిపోతున్నారు తప్ప పనులు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్‌లోని తహసీల్దార్ కార్యాలయం, ఇతర కార్యాలయాల సముదాయం ఆవరణలో ఎక్కడ చూసినా అపరిశుభ్ర పరిస్థితులు కానవస్తున్నాయి. ఆవరణ మొత్తంలో డ్రెయినేజీ వ్యవస్థ కానరాదు. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేదు. కచ్చా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినా ఉపయోగం ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. వర్షాకాలంలో మురుగు నీరు బయిటకు వెళ్లే పరిస్థితులు అసలు లేవు. ఆవరణలోని పలు మురుగు గుంటలు దోమలకు నిలయాలుగాను, ఉత్పత్తి కేంద్రాలుగా మారి ఉంటున్నాయి. వర్షకాలంలో నీరు ఎండకపోవడంతో కచ్చా డ్రెయినేజీ అంతా మురుగు కూపంలా మారి దుర్గంధం వెదజల్లుతుంది. ఎక్కడ చూసిన చిత్తడి చిత్తడిగాను, అక్కడకు వచ్చిన వారు ముక్కు మూసుకునే వెళ్లే పరిస్థితులు ఉన్నాయి.

మంత్రిగా పైడికొండల సమయంలో...

మంత్రిగా పనిచేసిన పైడికొండల మాణిక్యాలరావు ఉన్న సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెత్త చెదారాలను తొలగించేందుకు స్వచ్ఛ భారత్ నిర్వహించే వారు. ప్రతి వారం అపరిశుభ్ర పరిస్థితులను తొలగించేవారు. వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. అనంతర కాలంలో కార్యాలయం ఆవరణను పట్టించుకునే వారే కరవయ్యారు.

వివిధ కార్యాలయాలు

తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం, బ్రిటిష్ కాలం నాటి పాత ఎంఆర్ఓ కార్యాలయం, నిర్మాణ దశలో ఉన్న కొత్త తహసీల్దార్ కార్యాలయం, ఎంఈఓ, ఎంపీడీఓ, మహిళా సమాఖ్య భవనం, హౌసింగ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎస్‌టీఓ కార్యాలయం, సీనియర్ సిటిజన్స్ కార్యాలయం తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న అన్ని కార్యాలయాలకు ఎన్నో వందలాది మంది ఆయా పనులు మీద రాక పోకలు సాగిస్తారు. రోజు బిజీ, బిజీగా ఈ ప్రాంగణం ఉంటుంది. ప్రజా ప్రతినిధులు, అన్ని రంగాల ఉన్నతాధికారులు, అధికారులు తరుచుగా ఈ ప్రాంగణంలోకి వస్తూ, వెళ్తుంటారు. ఇక్కడ పరిస్థితలు వారికి తెలిసిందే. కాని అపారిశుద్ధ్య పరిస్థితులు తొలగడం లేదు. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు సమస్యను గుర్తించి, అపారిశుద్ధ్య పరిస్థితులను తొలగించి, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని, పరిష్కార మార్గం చూపాలని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎత్తు పల్లాలు ఎగుడు దిగుడులు

కార్యాలయాల ఆవరణ మొత్తం ఎత్తు, పల్లాలు, రాళ్లు, రప్పలతోను, మట్టి, ఇసుకలతోను, ఎగుడు, దిగుడుగాను కానవస్తుంది. ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. పిచ్చి మొక్కలకు నిలయాలుగాను, తుప్పలతోను, తూడుతోను, వ్యర్థాలతోను అస్తవ్యస్త పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఆవరణలో గతంలో ఉన్న సబ్ జైలు సమీప ప్రాంతాల్లో విష జంతువులకు నిలయంగా మారి ఉందని అంటున్నారు. ఈ కారణంగా ఆ ప్రాంతంలో తిరిగే అనేక మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆవరణలో పాడైన కారులు, జీపులు, ఆటోలు ఇతర వాహనాలు పాడై శిథిలావస్థలో ఉన్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో అస్తవ్యస్త పరిస్థితులు ఉన్నా, పట్టించుకునే నాథుడు లేకపోవడం శోచనీయంగా ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినా అక్కడ అక్కడ చెత్త చెదారాలు తొలగించి తూతూ మంత్రంగా పనిచేయడం మినహా పరిస్థితులలో మార్పులు రావడం లేదని పలువురు వాపోతున్నారు.



కార్యాలయ ఆవరణలో అస్తవ్యస్త పరిస్థితులు



కార్యాలయం ఆవరణలో శిథిలమైన వాహనాలు



ఆవరణలో ప్రధాన ప్రాంతంలో కచ్చా డ్రెయిన్

విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు

అత్తిలి: విద్యార్థినిలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఈవో ఎంపీఎల్‌కే ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు శుక్రవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో బహుమతుల అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 15 నుంచి 20 సంవత్సరాలలోపు విద్యార్థుల ఆలోచన విధానాలలో మార్పులు ఉంటాయని వారు సక్రమ పంథాలో పయనించి ఉన్నత విద్యావంతులుగా తయారు కావాలన్నారు. పిల్లలకి సెల్ ఫోన్లు నుంచి దూరం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, మండల ఉపాధ్యక్షురాలు కొనకళ్ళ విజయనిర్మల, జెడ్పీటీసీ అడ్డాల జానకి, ఎంపీడీవో పి శామ్యూల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఎం శ్రీదేవి, విజయ కుమారి, కనకమహాలక్ష్మి, ఎంఎస్‌కేలు భవానీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు

అత్తిలి: మండలంలో ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదుకు ఈనెల 23 నుంచి 30 వరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పి.శామ్యూల్ తెలిపారు. ఆధార్ నమోదుతో పాటు ఐదు నుంచి ఏడు సంవత్సరాలలోపు పిల్లలకు మొదటి దశ మేండేటరీ అప్‌డేట్ చేస్తారని తెలిపారు. అత్తిలిలో 23 నుంచి 30 వరకు శిబిరాలు జరుగుతాయని అన్నారు. ఆరవల్లి, మంచిలి, ఈడూరు గ్రామాల్లో 27 నుండి 28 వరకు, బల్లిపాడు, కొమ్మర, ఉరదాళ్లపాలెం, తిరుపతిపురం గ్రామాల్లో 29 నుంచి 30 వరకు శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యేక ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నకిలీ మద్యంపై కథనాలు రాస్తే కేసులా?



తణుకు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నారాయణకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు, వివిధ పార్టీ నాయకులు, న్యాయవాదులు



ఇన్‌చార్జి ఆర్ఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: నకిలీ మద్యం కుంభకోణంపై కథనాలు రాస్తున్న జర్నలిజంపై వేధింపులు, కేసులు నమోదు చేయడం పత్రికాస్వేచ్ఛను హరించడమేనని సీనియర్ జర్నలిస్ట్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై పోలీసుల వేధింపుల నేపథ్యంలో తణుకు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భావస్వేచ్ఛా ప్రకటనను కాలరాసే విధంగా జర్నలిస్టులపై కేసులు నమోదుచేయడం సిగ్గుచేటన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకునే విధంగా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తరపున న్యాయస్థానాల్లో కేసులు వేస్తామని హెచ్చరించారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ పత్రికల్లో వచ్చే కథనాల్లో పొరపాట్లు ఉంటే న్యాయపరంగా వెళ్లాలే కానీ యాజమాన్యాలు, జర్నలిస్టులపై కేసులు నమోదుచేసే విధంగా ప్రభుత్వం మొండిగా నడవడం దుర్మార్గమని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నారాయణకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఏపీడబ్ల్యుజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తణుకు ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు తానేటి దొరబాబు, గుమ్మడి ఆంజనేయులు, కొలగాని రాజా, పాలకొల్లు పెద్దిరాజు, ఎం.కనకేశ్వరరావు, వేణు, వసంతాడ హరీష్, నాని, పమ్మి ఏడుకొండలు, బడేటి బాబు, సతీష్, ఐలు న్యాయవాది చోడే గోపీకృష్ణ, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, ఎం.లలిత, జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు సరికావు

తాడేపల్లిగూడెం (టీటౌన్): సమాజంలో మంచిని, చెడును చూపిస్తున్న పత్రికా సంపాదకులు, విలేకర్లపై ప్రభుత్వం కక్షపూరిత చర్యలు విడనాడాలని, పత్రిక స్వేచ్ఛను కాపాడలని కోరుతూ తాడేపల్లిగూడెం సాక్షి విలేకర్లు యడ్లపల్లి మురళీకృష్ణ, కె.వి.కృష్ణారావు, కె.శ్రీనివాస్, బి.శ్రీకాంత్, కె.ఆశీర్వాదరావులు శుక్రవారం పట్టణంలోని ఇన్‌చార్జి ఆర్ఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

21 నుంచి సమ్మెలోకి పారిశుద్ధ్య కార్మికులు



డాక్టర్ సాయికిరణ్, తాతారావులకు సమ్మె నోటీసు అందిస్తున్న భీమారావు, కార్మికులు

తణుకు అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల 3 నెలల వేతన, 41 నెలల పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయికనుగుణంగా కనీసం ఏభై మందికి తగ్గకుండా పారిశుద్ధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తొలగించాలని కోరుతూ ఈనెల 21వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్టు ఏపీ మెడికల్ కాంటాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. ఏపీ మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.సాయికిరణ్, ఆర్‌ఎంవో డాక్టర్ తాతారావులకు సమ్మె నోటీసు సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికలకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలే నెలా నెలా సక్రమంగా ఇవ్వక పోవడంతో పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. తక్షణమే హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించి వారి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని భీమారావు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, భారతి, సీహెచ్ మంగమ్మ, పి.విజయలక్ష్మి,, మెండి శ్రీను, వెంకటలక్ష్మి, ప్రసన్న, ఎం.బేబి, ఇ.హైమావతి,డి. శ్రీనువాసు, చింతాలు,డి.దంమూరు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణంలోని వన్ టౌన్ నార్త్ ఏరియా పరిధిలో 33/11 కేవీ పాతూరు సబ్ స్టేషన్ పరిధిలోని జెడ్పీహెచ్ ఫీడర్, 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్ రోడ్డు ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మెయిన్ రోడ్డు, మసీద్ రోడ్డు, పాతూరు, పుట్టింటి బలుసులమ్మ గుడి ఏరియా, హౌసింగ్‌బోర్డు ఏరియా, శశి కళాశాల రోడ్డు, ఎస్ఎస్ రాజు లేఅవుట్ ఏరియాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు టూ టౌన్ సౌత్ పరిధిలో..

పట్టణంలోని టూ టౌన్ సౌత్ ఏరియా పరిధిలో 33/11 కేవీ యాగర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. యాగర్లపల్లి ఏరియా, కొబ్బరితోట ఏరియాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

పెంటపాడు: మండలంలో జువ్వలపాలెం సబ్‌స్టేషన్‌కు సంబంధించి పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోతలు ఉంటాయన్నారు.

ఎంపీటీసీలకు జీతాలు ఇప్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఇరగవరం: మండలంలోని ఎంపీటీసీలకు వెంటనే జీతాలు ఇప్పించాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. శుక్రవారం ఇరగవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఓగిడి ఎంపీటీసీ మారుమూడు భారతి మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీటీసీలకు జీతాలు బాగానే వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనీసం ఎంపీటీసీలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజా ప్రతినిధులు నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చి నివృత్తి చేశారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలి

అత్తిలి: గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యుల న్యాయబద్ధమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది కోరారు. సమ్మె చేస్తున్న వైద్యులకు సంఘీభావంగా శుక్రవారం అత్తిలి పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ జీఎస్ గనిరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో వందలాది మంది వైద్యులు గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో అనేక ఇబ్బందులను ఓర్చి సేవలందిస్తున్నారని, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ జి ప్రమీలాదేవి, స్టాఫ్‌నర్స్ దిల్షాద్‌బేగం, ఎంఎల్‌హెచ్‌పీ ఎం శాంతిరాజు పాల్గొన్నారు.

నూతన కార్మిక విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్

తాడేపల్లిగూడెం (టీటౌన్): కేంద్రం తాజాగా ప్రకటించిన నూతన కార్మిక విధానాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు పట్టణంలో శుక్రవారం స్థానిక సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సీనియర్ నేత నెక్కంటి సుబ్బారావు ప్రారంభించారు. కామ్రేడ్ పూడి సుబ్బారావు ప్రాంగణంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి రవీంద్రనాథ్‌తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్, జే.లలితమ్మలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన పనిచేయాల్సిన కార్మిక శాఖ తన స్వరూపాన్ని, స్వభావాన్ని కోల్పోతుందన్నారు. పనిగంటల మార్పు, మహిళలు రాత్రి పూట పనిచేయాలని నిర్ణయించడం సరికాదని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్ మాట్లాడుతూ ఏఐటీయూసీకి పట్టణంలో ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. 1943లో స్వర్గీయ ఎంవీఎస్ కపర్ది పంచాయితీ కార్మికులతో తొలి కార్మిక సంఘాన్ని పట్టణంలో ఏర్పాటు చేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో రాంప్రసాద్

పెంటపాడు: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు మండల సమావేశ మందిరంలో బాలికలకు సంబంధించి మిషన్‌శక్తి వర్కుషాపును శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో పీఎస్ రాంప్రసాద్ మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా అరికట్టేందుకు కమిటీ సభ్యుల సహకారం తప్పక ఉండాలన్నారు. యుక్తవయస్సు రాకుండా వివాహం చేస్తే దానికి తగ్గ మూల్యం తప్పక చెల్లించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, సుజాత, అంగన్‌వాడీ వర్కర్ల సంఘ అధ్యక్షులు శ్యామల, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకే క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు

తాడేపల్లిగూడెం రూరల్: పారిశుద్ధ్యంలో ప్రజల్ని భాగస్వామ్యం చేసేందుకు క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ల వ్యవస్థను తీసుకొచ్చినట్లు తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ డీఎల్‌డీవో జీవీకే.మల్లిఖార్జునరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మారంపల్లి ఎల్‌టీసీ సెంటర్ వద్ద తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో ఎంపిక చేసిన క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రజల్ని చైతన్యవంతులను చేసి, చెత్త నుంచి సంపద తయారీ ప్రక్రియను పునరుద్ధరించేందుకు గ్రామ స్థాయిలో రిసోర్స్‌పర్సన్లు ఉపకరిస్తారన్నారు.

చురుగ్గా మహానాగు చిత్రం షూటింగ్

పెంటపాడు: మండలం రాచర్ల గ్రామంలో నూతన చిత్రమైన మహానాగు చిత్రం షూటింగ్ వేగంగా జరుగుతోంది. కాగా నూతన నటీనటులతో నిర్మించబోయే ఈ చిత్రానికి సంబంధించి గ్రామీణ హోటల్, హాస్యసన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర డైరెక్టర్ ఉదయభాస్కర్, నిర్మాత తుమ్మల రామసత్యనారాయణలు మాట్లాడుతూ మహానాగు సినిమా ద్వారా భక్తి పారవశ్యమైన ఆధ్యాత్మికత ఉండేలా ఈ చిత్రం ఉంటుందన్నారు. ప్రధానంగా అధికభాగం రాచర్లలో షూటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.